ఆర్‌ఎస్‌కేలపై నిర్లక్ష్యం

- పర్యవేక్షణ పట్టని అధికారులు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్న వైనం
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న రైతులు


తలుపులు లేని కేఎస్ పాళెం రైతు సేవ కేంద్రం

కదిరి అర్బన్: వ్యవసాయ సేవలు అందించాల్సిన రైతు సేవ కేంద్రా(ఆర్‌ఎస్‌కే)లపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇదే అదనుగా అసాంఘిక శక్తులు పలు చోట్ల ఈ భవనాలను తమ అడ్డాలుగా మార్చుకుంటున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) పేరిట పథకాల అమలు, విత్తనం, ఎరువుల పంపిణీ, గిట్టుబాటు ధరలకు పంటల కొనుగోలు తదితర సేవలు ఇతోధికంగా అందించి రైతుల మన్ననలు అందుకున్నాయి. అలాంటి కేంద్రాలు కూటమి పాలనలో నిర్వీర్య దశకు చేరుకుంటున్నాయి. గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున కదిరి మండలంలో 14 పంచాయతీల పరిధిలో 12 ఆర్‌ఎస్‌కే భవన నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. అందులో ఏడు కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తవడంతో అందులో కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఒక్కో భవనం రూ.25 లక్షల వ్యయంతో నిర్మించారు. అయితే ఇవి ఊరికి కాస్త దూరంగా ఉండటంతో మందుబాబులు తమ అడ్డాగా వినియోగించుకుంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్కడే మందు తాగడం, పేకాట ఆడటం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొండమనాయుని (కేఎస్) పాళెం రైతు సేవ కేంద్రాల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుస్తోంది. కాళసముద్రం కేంద్రం వద్ద మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. మందుబాబులు మత్తులో కిటికీలు, తలుపులు పగులగొడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

నూతన భవనాలు వాడుకోవాలి



గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రా(ప్రస్తుత రైతు సేవ కేంద్రా)లు నిర్మించారు. నేడు కొన్ని చోట్ల వినియోగంలో లేవు. రైతుల కోసం నిర్మించిన ఈ భవనాలు మందుబాబులకు ఆవాసాలుగా మారడం బాధేస్తోంది. వ్యవసాయాధికారులు ఆర్‌ఎస్‌కేలకు సిబ్బందిని నియమించి రైతులకు సేవలు అందించాలి.

– చంద్రమౌళిరెడ్డి, నడింపల్లి

తలుపులు, కిటీకీలు సరిగాలేవు



కేఎస్ పాళెం రైతు సేవ కేంద్రం భవనానికి తలుపులు, కిటికీలు లేవు. అలాంటి చోట సిబ్బంది విధులు ఎలా నిర్వహిస్తారు? కుమ్మరవాండ్లపల్లి– 1 రైతు సేవ కేంద్రం భవనం మాకు అప్పగించలేదు. వేరేశాఖకు అప్పగించారని తెలిసింది. నేను ఇటీవలే విధుల్లో చేరాను. అన్నీ పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తాం.

– శ్రీహరినాయక్, మండల వ్యవసాయాధికారి, కదిరి

రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' అందజేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ పథకం' వర్తింపచేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కదిరప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో రైతు సమస్యలపై తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారం పెట్టుబడి సాయం కింద భూమి ఉన్న ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. కాని అధికారంలోకి రేడాది కాలం దాటిన తర్వాతా అనేక కొర్రీలు పెట్టి పీఎం కిసాన్‌తో కలిపి ఒక్కో కుటుంబానికి రూ.7 వేలు మాత్రమే అందజేస్తున్నారన్నారు.భూములు ఉన్న చాలా మంది రైతులకు సాయం అందడం లేదన్నారు. దీంతో పాటు భూములు లేక కౌలుకు పంటలు సాగుచేసే రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయలేదన్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు మరోసారి పరిశీలన చేసి పంటలు సాగుచేసే ప్రతి రైతుకు ఈ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యనమల ప్రసాద్, రాజేంద్ర, వన్నూరప్ప, రైతులు పాల్గొన్నారు.

హామీలపై పాలకులను నిలదీయండి


ఇరగరాజుపల్లిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పోస్టర్లు ప్రదర్శిస్తున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని కూటమి ప్రభుత్వ పాలకులను నిలదీయాలని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ మాబూసాహెబ్, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఇరగరాజుపల్లి, కొట్లపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' పేరుతో ఎన్నికల మేనిఫెస్టోను గుర్తుకు తెచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వందకు పైబడి హామీలు ఇచ్చి.. అందులో ఒకటో రెండో అరకొరగా అమలు చేసి.. గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులను, ప్రజాప్రతినిధులను నిలదీయాలన్నారు. తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని రూ.13వేలకు కుదించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని దాని ఊసే ఎత్తడం లేదన్నారు. సూపర్ సిక్స్ మాటెత్తితే నాలుక కోస్తామని బెదిరించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటికే సంక్షేమ పథకాలు ఇవ్వకుండా మద్యం డెలివరీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కుళ్లాయిరెడ్డి, వెంకటరెడ్డి, వలంటీర్ విభాగం అధ్యక్షుడు శివానంద, మాజీ సర్పంచ్ పెద్ద నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, అంజనేయులు, రంగనాథ్, ఆదినారాయణరెడ్డి, శంకర్ రెడ్డి, వెంకటేష్, సోమశేఖర్‌రెడ్డి, కిష్టప్ప, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి


ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి

ధర్మవరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పీఆర్‌సీని నియమించి ఐఆర్ (మధ్యంతర భృతి) వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్ఆర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, శివానగర్, శాంతినగర్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పీఆర్‌సీని నియమించకుండా ఉపాధ్యాయ, ఉద్యోగ లోకానికి తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. బదిలీలు, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయుల పొజిషన్ ఐడీల సమస్యను పరిష్కరించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికి మూడు డీఏలు బకాయి ఉన్నప్పటికీ ఒటీ ఇవ్వకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రధాన కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, రమేష్‌బాబు, అమానుల్లా, గోపీ, వెంకటేష్, శేఖర్, అంజినాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రం నిర్మించేదెన్నడో?


పేరూరులో మూతపడిన పశువైద్య కేంద్రం

రామగిరి: మండలంలోని పేరూరులో ఉన్న పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. భవనం ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో తాత్కాలికంగా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రామగిరి మండలంలో పేరూరు పెద్ద వ్యాపార కేంద్రం. కంబదూరు, కనగానపల్లి, మండలాలతో పాటు కర్ణాటక ప్రాంత వాసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల పెంపకందారులు వైద్యం కోసం పేరూరుకు వస్తున్నారు. పశుయజమానులు ఇబ్బందులు పడకుండా నూతన పశువైద్య కేంద్రం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విశా ఫెర్రర్

ధర్మవరం రూరల్: మహిళలు ఆర్థికస్వావలంబన సాధించాలని ఆర్డీటీ మహిళా సాధికార విభాగపు డైరెక్టర్ విశా ఫెర్రర్ సూచించారు. సోమవారం బత్తలపల్లిలోని ఆర్కే ఫంక్షన్ హాలులో ఆర్డీటీ పొదుపు మహిళలు దాదాపు వెయ్యి మంది కలిసి చైతన్య కోఆపరేటివ్ బ్యాంక్ ప్రథమ మహా సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశా ఫెర్రర్‌తో పాటు ఆర్‌వైడీటీ డైరెక్టర్ నిరంజన్, హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, రీజనల్ డైరెక్టర్ హనుమంతప్ప, ఏటీఎల్ కృష్ణ, ఎస్టీఎల్ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విశా ఫెర్రర్ మాట్లాడుతూ మహిళలు ఏర్పాటు చేసుకున్న చైతన్య సొసైటీ సహకార బ్యాంక్ వచ్చే ఏడాదికి మరింత అభివృద్ధికి చేరుకోవాలన్నారు. మహిళలు పొదుపు చేసుకొని కుటుంబ పోషణకు చేయూతగా నిలవాలన్నారు. ఆర్థిక స్వాలంబనతోనే మహిళల ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. ఈ మహాసభలో బ్యాంక్ లాభ నష్టాలు, బ్యాంకు ఉద్దేశాలు, భవిష్యత్ ప్రణాళికపై చర్చించుకున్నారు. కొత్తగా ఎంపికైన ఐదుగురు బీఓడీలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది అంకాల్ కుమార్, కావేరి, మధుసూదన్, కేశవరెడ్డి, శోభారాణి, వెంకటేష్, రమణప్ప, నాగరాజు, నారాయణమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవ విగ్రహాల చుట్టూ జీవాలను ప్రదక్షిణ చేయిస్తున్న కాపర్లు

జీవాలను కాపాడు స్వామీ..

రొళ్ల: పెంపుడు జీవాలు రోగాలు బారిన పడకుండా కాపాడు స్వామీ అంటూ గొర్రెల కాపర్లు రంగనాథస్వామి, జుంజప్పస్వామిని వేడుకున్నారు. సోమవారం మండల పరిధిలోని కె.గొల్లహట్టిలో వెలసిన స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా రొళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వద్దకు తీసుకువచ్చి పట్టం కూర్చోబెట్టారు. ప్రత్యేక పూజల తర్వాత కాపర్లు ఉత్సవ విగ్రహాల చుట్టూ జీవాలను ప్రదక్షిణ చేయించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

పెనుకొండ: దళితుల శ్మశాన వాటికను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి సోమవారం ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌ను కోరారు. ఇందులో భాగంగానే వినతిపత్రం అందించారు. సోమందేపల్లిలో దళితుల శ్మశాన వాటికను కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నదాన సత్రంలో శాంతి హోమం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదాన సత్రంలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం శాంతి హోమాన్ని నిర్వహించారు. ఆగమీకులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు అత్యంత వైభవంగా హోమాన్ని జరిపించారు. అన్నపూర్ణేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చిక్కబళాపురానికి చెందిన నారాయణప్ప సుమారు రూ. 10 లక్షలను డైనింగ్ హాల్‌కు తన సొంత నిధులు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా ఈయన్ను సన్మానించారు. సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం


ఓడీచెరువులో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

ఓడీచెరువు : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది విడుదల చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు, ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలను తప్పనిసరిగా తాగించాలని సూచించారు. ముర్రు పాలే బిడ్డకు తొలి టీకా అని తెలిపారు. పిల్లలకు క్రమం తప్పకుండా నెలవారీ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి,ఎంపిడిఓ శివరాం ప్రసాద్ రెడ్డి,ఐకెపి ఏరియా కోఆర్డినేటర్ రవీంద్ర, ఎంఈఓ సురేష్ కుమార్, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు


గాండ్లపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతమ్మ అధ్యక్షతన సోమవారం ప్రపంచ తల్లి వారోత్సవాలపై ర్యాలీ, సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా కొనసాగింది. తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం–4లో తల్లులతో సమావేశం నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యత తెలియజేశారు.


రామగిరిలో అంగన్‌వాడీల ర్యాలీ

తల్లిపాలలో పోషకాలు మెండు

రామగిరి: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ గంగాభవానీ మాట్లాడుతూ.. చిన్నారులకు తల్లిపాలు ఎంతో అవసరమన్నారు. తల్లిపాలలో పోషకాలు లభిస్తాయని తెలిపారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి రామగిరి బస్టాండ్ ప్రాంతంలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లతాకిరణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్షుడు మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శి పతకమూరి నాగభూషణం కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ మహేష్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా ఇల్లు నిర్మించాలని విన్నవించారు. జర్నలిస్టులకు కనీస గౌరవ వేతనం అందించేలా, ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పని చేస్తున్న జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించేలా ప్రతిపాదనలు పంపాలన్నారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ పట్టణాధ్యక్షుడు మజ్జిగ భాస్కర్, డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లా, గంటపార నాగరాజు, బాబయ్య, మంజు, శ్రీనాథ్, చెన్నప్ప, శివ తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ ప్రాధాన్యత తెలుసుకోండి


మెమొంటో అందజేస్తున్న ఎస్కేయూ సంచాలకులు వెంకటరమణ

పుట్టపర్తి అర్బన్: విద్యార్థులు కామర్స్ ప్రాముఖ్యతను తప్పకుండా తెలుసుకోవాలని ఎస్కే యూనివర్సిటీ పరీక్షల సంచాలకుడు వెంకటరమణ సూచించారు. సోమవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మంగళకర విద్యాసంస్థల్లో కామర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ నేటి తరంలో కామర్స్ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. దేశాభివృద్ధిని శాసించే స్థాయికి కామర్స్ విభాగం చేరిందన్నారు. ఉపాధి రంగంలో, జాతీయ ఆదాయ అభివృద్ధిలో కామర్స్ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. కామర్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యా ప్రకాష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఏఓ జయచంద్రారెడ్డి, అధ్యాపకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు

ధర్మవరం అర్బన్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వ్యక్తి జీవితాలను నాశనం చేస్తాయని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తును కుంగదీసే మాదకద్రవ్యాల వినియోగాన్ని పకడ్బందీగా అరికట్టాల్సిన బాధ్యత విద్యార్థులదేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు


పూజలు అందుకుంటున్న కాటికోటేశ్వర స్వామి

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారి మూలవిరాట్‌కు వెండి గొడుగులు, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు గదా గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి, ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు ఉన్నారు. రాత్రి ఆలయంలో బస చేసిన భక్తుల కోసం ఉరుములోళ్లతో కాటమయ్య స్వామి జీవిత చరిత్ర చెప్పించారు.

నేడు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

కదిరి అర్బన్: మండల పరిధిలోని కె.బ్రాహ్మణపల్లి, ఎగువపల్లి గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మణికంఠనాయక్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పార్టీనియోజకవర్గ సమన్వయ కర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు హాజరై విజయవతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు తూపల్లి, బొలిగుట్లపల్లి, మలమీదపల్లిలో...

గాండ్లపెంట: మండలంలోని తూపల్లిలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు, బొలిగుట్లపల్లిలో 11.30 గంటలకు, మలమీదపల్లిలో 12.30 గంటలకు ×బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ₹ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల హామీల అమలు తీరుకు సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి సోమవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, జెడ్పీ, మండల కోఆప్షన్ సభ్యులు, డైరెక్టర్‌లు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లు అందుకుంటున్న కరాటే క్రీడాకారులు

ధర్మవరం: జాతీయస్థాయి కరాటే పోటీల్లో ధర్మవరం మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఇందుకు సంబంధించిన వివరాలను కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా సోమవారం వెల్లడించారు. ఇటీవల బెంగళూరు ఎంసీఏ ఫంక్షన్‌హాలులో జపాన్‌షటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ధర్మవరం మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీకి చెందిన 16 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కటా, కుమితే విభాగాల్లో విద్యార్థులు నవ్యశ్రీ మహిధర్, అఫ్రోజ్, ఉదయ్‌కుమార్, శర్వీన్‌రెడ్డి, జి.నాని గోల్డ్ మెడల్ సాధించారు. ఆర్గనైజర్ల చేతులమీదుగా బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నారని కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు.

ఉచిత ఉపకరణాల కోసం ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

ధర్మవరం రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచిత ఉపకరణాల ఎంపిక కోసం సోమవారం ధర్మవరంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ క్యాంపునకు ఎంఈఓ గోపాల్ నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కృష్ణప్ప, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజ్, సహిత విద్య సమన్వయ కర్త ఆనంద్ బాబు, ప్రధానోపాధ్యాయులు నాగప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక అవసరాల పిల్లలకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నాయన్నారు. అందులో భాగంగా కృత్రిమ ఉపకరణాల ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి పీఏ హరీష్‌బాబు పాల్గొన్నారు.

8 మందికి స్వల్ప గాయాలు

పెనుకొండ: మండలంలోని హరిపురం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరుకు చెందిన ఇంద్రజ, సుధాకర్, రాఘవేంద్ర, వేమేష్, మంజుల, శశికళ తదితరులు అరుణాచలం వెళ్లి ఎమ్మిగనూరుకు తిరిగి వెళ్తుండగా హరిపురం వద్ద సిమెంట్ లారీ ఢీకొనడంతో స్వల్పంగా గాయపడినట్లు ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూద కేంద్రంపై పోలీసుల దాడి

నల్లమాడ: కుటాలపల్లి సమీపాన గుట్టలో జూద కేంద్రంపై సోమవారం సీఐ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేశారు. ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.12,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు జూదరులు తప్పించుకుని పారిపోయారన్నారు. దాడిలో సీఐతో పాటు ట్రైనీ ఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ రంగాయాదవ్, కానిస్టేబులు శంకర్ పాల్గొన్నారు.